క్లుప్తంగా

ఈద్గాలు పరిశీలించిన తహసీల్దార్


ఏర్పాట్లు పరిశీలిస్తున్న రియాజ్ అలీ

సిర్పూర్(టి): రంజాన్ పురస్కరించుకుని ఈద్గాల్లో వేడుకల నిర్వహణకు జరుగుతున్న పనులను మంగళవారం సిర్పూర్(టి) తహసీల్దార్ రియాజ్ అలీ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రంజాన్ వేడుకల కోసం మండల కేంద్రంలోని రెండు ఈద్గాల్లో అన్ని ఏర్పాట్లు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఎండలను దృష్టిలో పెట్టుకుని ఈద్గాల వద్ద టెంట్లు, తాగునీటి వసతితో పాటు ఇతర సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు కిజర్‌హుస్సేన్, ఈవో కృష్ణమూర్తి, నాయకులు ఇఫాత్‌హుస్సేన్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రంజాన్ కానుకల పంపిణీ


దుస్తులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ మోతిరాం

కెరమెరి: రంజాన్ పురస్కరించుకొని మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ప్రభుత్వం అందించిన దుస్తులను ఎంపీపీ పెందోర్ మోతిరాం, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ షాదీముబారక్, మైనార్టీ గురుకులాలు తదితర కార్యక్రమాలు చేపట్టి సీఎం కేసీఆర్ మైనార్టీల ఆశాకిరణంగా నిలిచారన్నారు. ఎంపీటీసీ ఇఫ్తేకార్, ఉపసర్పంచ్ నిసార్, నాయకులు ఉన్నారు.

పరామర్శ

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని బాబాపూర్ సర్పంచ్ లక్ష్మి ఇటీవల ప్రమాదంలో గాయపడగా మంగళవారం జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి పరామర్శించారు.

జెడ్పీటీసీ పరామర్శ..

అనారోగ్యంతో హైదరాబాద్ యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న అంకుసాపూర్ సర్పంచ్ పార్వతిని జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు గ్రామంలో పరామర్శించారు.

కేంద్ర పథకాలు సద్వినియోగం చేసుకోవాలి


అవగాహన కల్పిస్తున్న బ్యాంకు అధికారులు

కౌటాల: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీమా పథకాలను బ్యాంకు ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కౌటాల టీజీబీ మేనేజర్ నరసింహస్వామి అన్నారు. మంగళవారం మండలంలోని మొగడ్‌దగడ్, బాలేపల్లి గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు ప్రధాన మంత్రి జీవనజ్యోతి, సురక్ష బీమా యోజన పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రాజేశ్, మారుతి, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్
కుమురంభీం : రుద్రుడు
కాగజ్‌నగర్
వెంకటరమణ : రుద్రుడు

- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.20
సిమ్లామిర్చి	60
దోసకాయ	50
చామగడ్డ	60
వంకాయ	40
బీరకాయ	60
కాకరకాయ	60
బెండకాయ	60
అలసంద	40
దొండకాయ	60
పచ్చిమిర్చి	50
పాలకూర	40
సోరకాయ	60
రతాళం	60
గోబి(పూల్)	40
క్యాబేజి	40

-ఆసిఫాబాద్‌అర్బన్

కానరాని భగీరథ నీటి జాడ


నవేగాంలో అలంకారప్రాయంగా భగీరథ నీటి ట్యాంకు


నిరుపయోగంగా నల్లాలు

- నెలల తరబడి సరఫరాకు నోచుకోని శుద్ధజలం
- అలంకారప్రాయంగా నీటి ట్యాంకులు, నల్లాలు
- బోరింగులపైనే ఆధారపడుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు


టోకిగూడలో కనెక్షన్ ఇవ్వకుండా వదిలేసిన మినీట్యాంకు పైపులు

వాంకిడి: మారుమూల గ్రామాల్లో సైతం ప్రతీ ఇంటికి శుద్ధజలం అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మిషన్ భగీరథ పథకం అధికారుల నిర్లక్ష్యంతో నీరుగారుతోంది. నెలల తరబడి లీకేజీలకు మరమ్మతులు చేయకపోవడంతో ట్యాంకులు, నల్లాలు నిరుపయోగంగా మిగిలిపోతున్నాయి. ఉమ్మడి ఇందాని గ్రామపంచాయతీ నుంచి కొత్తగా ఏర్పడ్డ నవేగాం గ్రామపంచాయతీ ప్రజలు మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. వేసవికాలంలో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. భగీరథ నీరు కూడా అందకపోవడంతో ప్రస్తుతం గ్రామస్తులు బోరింగులపైనే ఆధారపడుతున్నారు. ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతున్నందున బోరింగు నీళ్లు ఎప్పుడైనా అడుగంటిపోయే ప్రమాదం ఉందని అలా జరిగితే గుక్కెడు నీటి కోసం కిలోమీటర్ల దూరం నడవాల్సిన పరిస్థితి ఉంటుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నెలల తరబడి సరఫరా లేదు..

మారుమూల గ్రామ పంచాయతీ నవేగాం పరిధిలో టోకిగూడ, టోకిగూడ 2, టోకిగూడ 3, డోంద్రా, కంకరగూడ వంటి ఆదివాసీ గ్రామాలు ఉన్నాయి. సుమారు 700 వరకు జనాభా ఉన్న ఈ గ్రామపంచాయతీలో ఏళ్లుగా నీటి సమస్య వెంటాడుతోంది. లీకేజీలు, అసంపూర్తి పనులతో భగీరథ నల్లా నీరు కలగానే మిగిలిపోతోంది. సంబంధిత అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఎలాంటి ప్రయోజనం ఉండటం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. టోకిగూడలో మిషన్ భగీరథ నీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన మినీ ట్యాంకు నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. పంచాయతీ కేంద్రంలోని ట్యాంకు సైతం నెలల తరబడి నిరుపయోగంగా ఉంది. అడపదడపా కొన్ని గ్రామాలకు నీటి సరఫరా చేస్తున్నా లీకేజీ ఏర్పడితే మాత్రం నెలల తరబడి సమస్య ఉంటుందని గ్రామస్తులు వాపోతున్నారు. లీకేజీ సమస్యలను త్వరగా పరిష్కరించి నీరు అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని మిషన్ భగీరథ నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలంటున్నారు. సమస్యపై మిషన్ భగీరథ ఏఈ శైలేందర్‌ను ఫోన్ ద్వారా వివరణ కోరగా అతి త్వరలో మరమ్మతులు చేయించి నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

భగీరథ నీరు రావడం లేదు



గతేడాది జూలై నుంచి నవేగాంలో భగీరథ నీటి సరఫరా జరగడం లేదు. టోకిగూడలో ఏర్పాటు చేసిన మినీట్యాంకును ఇప్పటివరకు ప్రారంభించలేదు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా రేపు మాపు అంటు కాలం వెళ్లదీస్తున్నారు. తొమ్మిది నెలలుగా సమస్య ఉన్న అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు.

– మడావి బాలు, సర్పంచ్, నవేగాం

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వహించొద్దు

సాక్షి ఎఫెక్ట్..


మురళీగూడలో పర్యటిస్తున్న ఎంపీడీవో గంగాసింగ్

పెంచికల్‌పేట్: పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వహించొద్దని ఎంపీడీవో గంగాసింగ్ అన్నారు. మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన 'మంచం పట్టిన మురళీగూడ' కథనానికి ఆయన స్పందించారు. మిషన్ భగీరథ, పంచాయతీ అధికారులతో కలిసి గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని వీధుల్లో తిరుగుతూ పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. గ్రామంలో ప్రబలుతున్న జ్వరాలను అదుపులోకి తీసుకురావడానికి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. భగీరథ నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. దోమల నివారణకు బ్లీచింగ్, స్ప్రే చేయాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. జ్వరంతో బాధపడుతున్న వారి నుంచి వివరాలు సేకరించారు. ఆయన వెంట సర్పంచ్ పార్వెటి ఈశ్వరీబాయి, గ్రిడ్ డీఈ పృథ్వీ, ఏఈ మనోహర్, పంచాయతీ కార్యదర్శి శాంతయ్య పాల్గొన్నారు.

అందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతాం


వాంకిడి: పలకలు పంపిణీ చేస్తున్న నాగేశ్వర్‌రావు

వాంకిడి: వయోజన నిరక్షరాస్యులందరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే తమ సంస్థ లక్ష్యమని విజ్ఞాన్ సోషల్ యాక్టివిటీస్ వెల్ఫేర్ సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ నాగేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీవో శివకుమార్‌తో కలిసి నిరక్షరాస్యులైన వయోజనులకు పలకలు పంపిణీ చేశారు.

విద్య ద్వారానే సమగ్ర అభివృద్ధి

తిర్యాణి: విద్య ద్వారానే సమాజ సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని జెడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో విజ్ఞాన్ సోషల్ యాక్టివిటీస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిరక్షరాస్యులైన వయోజనులకు ఉచితంగా పలకలు అందజేశారు. సంస్థ జిల్లా కోఆర్డినేటర్ నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ తమ సొసైటీ ఆధ్వర్యంలో త్వరలోనే అన్ని గ్రామాల్లో అక్షర జ్ఞాన కేంద్రం ప్రారంభించి నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతామన్నారు. సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి గుణవంత్‌రావు, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్ ఉన్నారు.

ఒకే ఈతలో నాలుగు పిల్లలు



దహెగాం: మండల కేంద్రంలో అల్లి రాజన్న అనే రైతుకు చెందిన మేక వారం రోజుల క్రితం ఒకే ఈతలో నాలుగు పిల్లలకు జన్మనిచ్చింది. మేక పిల్లలు క్షేమంగానే ఉన్నా వాటికి పాలు సరిపోవడం లేదని రైతు తెలిపాడు. దీంతో మరో పాలిచ్చే మేకను పిల్లల కోసం కొనుగోలు చేసినట్లు పేర్కొన్నాడు. ఒకే ఈతలో నాలుగు పిల్లలకు జన్మనివ్వడంతో పలువురు ఆసక్తిగా చూస్తున్నారు.

నల్లబ్యాడ్జీలతో జేపీఎస్‌ల నిరసన


కౌటాల: నిరసన వ్యక్తం చేస్తున్న కార్యదర్శులు


పెంచికల్‌పేట్: నిరసన తెలుపుతున్న జేపీఎస్‌లు

పెంచికల్‌పేట్: తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట మండలంలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. జేపీఎస్‌లు శ్రీకాంత్, రాకేష్, ఖుషీద్దీన్ తదితరులు ఉన్నారు.

కార్యదర్శులను రెగ్యులర్ చేయాలి

కౌటాల: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం వెంటనే రెగ్యులర్ చేయాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు తిరుపతి అన్నారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట పంచాయతీ కార్యదర్శులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శులు రజిత, శాలిని, శ్రావణి, అంజలి, రాజేశ్వరి, కవిత, తేజస్విని, జ్యేష్ఠ, గణేష్, భాస్కర్, తిరుపతి, సందీప్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి


కౌటాల: సమ్మె చేస్తున్న వీవోఏలు


దహెగాం: సమ్మెలో పాల్గొన్న వీవోఏలు

దహెగాం: తమ న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చాలని మండలంలోని వీవోఏలు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక ఐకేపీ కార్యాలయం ఆవరణలో నిరవధిక సమ్మెను కొనసాగించారు. వారు మాట్లాడుతూ వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు.

కెరమెరిలో..

కెరమెరి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కొనసాగుతున్న నిరసనల్లో భాగంగా మంగళవారం మండల సమాఖ్య కార్యాలయం ఎదుట వీవోఏలు మోకాళ్లపై కూర్చొని నిరసన చేపట్టారు. సంఘం జిల్లా కార్యదర్శి కూటికల ఆనంద్‌రావు, రమేశ్, రఘునాథ్ ఉన్నారు.

కౌటాలలో..

కౌటాల: ఐకేపీ వీవోఏల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ముంజం శ్రీనివాస్ అన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వీవోఏలు మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఎదుట రెండోరోజు మంగళవారం చేస్తున్న నిరవధిక సమ్మె కొనసాగింది. వీవోఏలు స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్ హరీష్‌కు వినతిపత్రం అందించారు. సమ్మెలో వీవోఏల ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్, సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎల్ములే దత్తు, నాయకులు భీంరావ్, దేవాజీ, కొండయ్య, మహేశ్వరి, పద్మ, ఇందు పాల్గొన్నారు.

వాంకిడిలో..

వాంకిడి: వీవోఏలకు కనీస వేతనం రూ.26 వేలు అందించడంతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వీవోఏలు మంగళవారం మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ సెర్ప్ నుంచి ఐడికార్డులు అందజేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సమ్మెలో వీవోఏలు సంతోశ్, ప్రభాకర్, వసంత్‌రావు, సాగర్, శంకరమ్మ ఉన్నారు.

సమ్మె నోటీసులు అందజేత

నార్నూర్: ప్రభుత్వం వీవోఏల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మండల కేంద్రంలోని ఐకేపీ ఏపీఎం రమేశ్, తహసీల్దార్ ఆర్కా మోతిరాం, ఎస్సై రవికిరణ్‌కు సమ్మె నోటీసులు అందజేశారు. అనంతరం ఐకేపీ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. సంఘం అధ్యక్షుడు గోవింద్, కార్యదర్శి రాథోడ్ శారద మాట్లాడారు. ఈనెల 4 నుంచి 16 వరకు ఆన్‌లైన్ పనులు బంద్, 17 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. సంఘం నాయకులు పవార్ విజయ్‌పాల్, తాతేరావు, ధోం డుబాయి, మౌనిక, జయసుధ, జనాబాయి తోపాటు మొత్తం 38 మంది వీవోఏలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ అగ్నిమాపక శాఖ అధికారులు మంగళవారం సిర్పూర్ పేపర్ మిల్లులోని కార్మికులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా ఫైర్ ఆఫీసర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది మిల్లులో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రాథమికంగా చేయాల్సిన పనులు, జాగ్రత్తలపై వివరించారు. ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. మిల్లు జీఎం గిరిధర్, ఫైర్ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలి


మాట్లాడుతున్న ప్రణయ్

ఆసిఫాబాద్: జిల్లాలోని అర్హులైన నిరుద్యోగ యువతీయువకులకు ప్రభుత్వం సబ్సిడీ రుణాలు వెంటనే మంజూరు చేయాలని బీసీ యువజన సంఘం నాయకుడు అవుడపు ప్రణయ్ కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ 2018లో జిల్లాలో సుమారు 4000 మంది నిరుద్యోగులు బీసీ సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోగా కేవలం 529 మందికి మాత్రమే రుణాలు అందాయన్నారు. ప్రభుత్వం స్పందించి అర్హులైన నిరుద్యోగులకు రుణాలు మంజూరు చేయాలని కోరారు. ఆయన వెంట సంఘ నాయకులు గడ్డల ప్రణయ్‌కుమార్, సైదం నాగరాజు, పిప్రి సాయి, గడ్డల కిరణ్, అడె సాగర్, దాడి సాగర్, అవిడపు తరుణ్ ఉన్నారు.

వేసవి దుక్కులతో భూసారం


రైతులతో మాట్లాడుతున్న ఏఈవో ఘనశ్యాం

కౌటాల: వేసవి దుక్కులతో రైతులకు మేలు కలుగుతుందని ఏఈవో ఘనశ్యాం అన్నారు. మంగళవారం కౌటాల గ్రామ శివారులో రైతులకు వేసవి దుక్కులపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలోనే రైతులు తమ చేలను దున్నుకోవాలన్నారు. చేలను లోతుగా దున్నడంతో నేల సారవంతంగా మారి గడ్డిజాతి మొక్కలు నాశనమవుతాయని తెలిపారు. రైతులు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలని తెలిపారు. ఆయన వెంట రైతులు ఉన్నారు.

నర్సరీని పరిశీలించిన ఎంపీడీవో


మొక్కలు పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని కడంబా గ్రామంలో గల నర్సరీని మంగళవారం ఇన్‌చార్జి ఎంపీడీవో గౌరీశంకర్ పరిశీలించారు. మొక్కల పెంపకంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీవో వెంట సర్పంచ్ బూరం రాజేశ్వరి, కార్యదర్శి సుమలత, వనసేవక్ ఆనంద్‌బాబు ఉన్నారు.

రోడ్డు నిర్మాణం పూర్తయ్యేనా..?

- గడువు తీరినా పూర్తికాని రోడ్డు
- ఇబ్బందుల్లో ప్రయాణికులు


కంకర తేలిన రోడ్డు

కాగజ్‌నగర్‌రూరల్: గ్రామీణ పల్లెలకు రోడ్డు సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన పనులు ముందుకు సాగడం లేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది. మండలంలోని గజ్జిగూడ బస్టాండ్ నుంచి ఆరెగూడ గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మించేందుకు ప్రధానమంతి గ్రామీణ సడక్ యోజన పథకం కింద రూ. 2.86 కోట్లు మంజూరయ్యాయి. గజ్జిగూడ, మోసం మీదుగా ఆరెగూడ గ్రామం వరకు సుమారు 5 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. 2021లో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించగా ఇప్పటివరకు పూర్తి కాలేదు. ఈ ఏడాది జనవరిలోపే రోడ్డు నిర్మాణం పూర్తి చేయాల్సి ఉండగా, అధికారుల అలసత్వం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా పనులు ముందుకు సాగడం లేదు. దీంతో ప్రయాణికులకు ఇబ్బంది తప్పడం లేదు.

తేలిన కంకరతో ఇబ్బందులు

గజ్జిగూడ నుంచి ఆరెగూడ వరకు కంకర వేసి వదిలేయడంతో ప్రయాణికులు తిప్పలు పడుతున్నారు. రోడ్డుపై కంకర తేలడంతో ద్విచక్రవాహనాలు పంచర్లు అవుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాస్పెల్లి, సారసాల, గజ్జిగూడ, సీతానగర్, జంబుగ గ్రామాల ప్రజలకు కడంబా, డబ్బా, బాబాసాగర్ గ్రామాలతో పాటు చింతలమానెపల్లి మండలానికి ఈ మార్గం గుండా వెళ్లేందుకు వీలుగా ఉంటుంది. చింతలమానెపల్లి మండల కేంద్రానికి వెళ్లాలంటే ఈ మార్గం గుండా వెళ్తే దూరభారం తగ్గుతుండడంతో ఈ మార్గంలో వెళ్లేందుకు ప్రయాణికులు ఆసక్తి చూపుతుంటారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పనులు వేగవంతంగా పూర్తిచేసి రవాణా సౌకర్యాన్ని మెరుగుపర్చాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

నెల రోజుల్లో పనులు చేపడుతాం

బీటీ రోడ్డు పనులు నెల రోజుల్లో చేపడుతాం. పనుల్లో జాప్యం జరుగుతున్న మాట వాస్తవమే. రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు ఆదేశాలు జారీ చేశాం.

- రాజ్‌కుమార్, పంచాయతీరాజ్ ఏఈ

పాలకుల నిర్లక్ష్యంతోనే..



రాష్ట్ర ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యంతోనే పనుల్లో జాప్యం జరుగుతోంది. కంకర తేలి ఉండటంతో వాహనాలకు పంచర్లు పడుతున్నాయి. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలి.

- అమనగంటి సాంబయ్య, మాజీ ఎంపీటీసీ

రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి



రోడ్డుపై కంకర తేలి ఉండటంతో ఇబ్బంది అవుతోంది. మా ఊరికి బీటీ రోడ్డు వస్తుందని ఎంతో సంబరపడ్డాం. కాని రోడ్డు పనులు పూర్తికావడం లేదు. అధికారులు స్పందించి రోడ్డు పనులు వేగంగా పూర్తి చేయాలి.

- సదువుల శంకర్, గజ్జిగూడ